మూడు రోజుల ముచ్చటే..!

"గత నెల 11న చీపురుపల్లి మండలంలోని పుర్రేయవలస జంక్షన్ వద్ద తోటపల్లి నీరు విడుదల కార్యక్రమం పెద్ద హడావుడిలా జరిగిం ది.ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు హాజరై పండితులతో పూజలు చేయించి కాలువలో పసుపు, కుంకుమ వదిలిపెట్టి తోటపల్లి నీటిని రైతులు సక్రమ పద్ధతిలో వినియోగించుకోవాలని ఉపోద్ఘాతం చేశారు."

కట్ చేస్తే.....

"సరిగ్గా ఇరవై రోజులు తిరగకముందే అంటే ఆగస్టు 31 నాటికి మూడు రోజులు ముందే కాలువల్లో నీటి జాడ కనిపించకుండా పోయింది. ఈ పది పదిహేను రోజులు కూడా కొద్ది స్థాయిలో మాత్రమే నీరు కాలువల్లో దర్శనమిచ్చి మాయమైపోయింది."

- నిలిచిపోయిన తోటపల్లి కాలువ నీరు
- నీటి విడుదల రోజు పూజలతో హడావుడి
- కొద్ది రోజులపాటు అంతంతగా మాత్రమే నీటి ప్రవాహం
- కాలువ పరిధిలోని 224 చెరువుల్లో ఒక్కటి కూడా నిండని వైనం
- 28 వేల ఎకరాలకు చుక్క నీరు అందని దుస్థితి
- ఆయకట్టుకు వర్షపు నీరే దిక్కు



చీపురుపల్లి మండలంలోని రెడ్డిపేట సమీపంలో ఎండిపోయిన తోటపల్లి కాలువలో తాజా వర్షాలకు చేరిన నీరు

చీపురుపల్లి: గతేదాది వరకు తోటపల్లి కుడి ప్రధాన కాలువ నిండుగా నీరు ప్రవహించడం చూసిన రైతులు ఈ ఏడాది కనీసం రెండు అడుగుల ఎత్తులో కూడా నీరు రాకపోవడం, అది కూడా పట్టుమ ని పది రోజులు కూడా లేకపోవడంతో ఖరీఫ్ సాగు ఎలా అంటూ ఆందోళన చెందుతున్నారు. జూలై నెలాఖరు నాటికే రావాల్సిన తోటపల్లి నీరు ఆగస్టు మూడో వారం వరకు రాకపోయినా పట్టించుకో ని పాలకులు ఆగస్టు 11న తోటపల్లి నీరు విడుదల చేస్తున్నామంటూ పెద్ద హడావుడే చేశారు. ఆ రోజు అక్కడ సీన్ చూసే వారందరికీ కాస్త ఆశ్చర్యం వేసింది. ఎందుకంటే గత ప్రభుత్వం ఐదేళ్లు ఖరీఫ్ సీజన్‌లో నీరు విడుదల చేయ డమే తప్ప ప్రజాప్రతినిధులు ఇలా హడావుడి చేయకపో వడమే అందుకు కారణం. తోటపల్లి నీరు విడుదల చేస్తున్నామంటూ హడావుడి చేసిన పాలకులు ఆ నీరు వస్తుందో రాలేదో, రైతులకు ఏ మేరకు ఉపయోగపడుతుందో కనీసం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మండల నాయకుల నుంచి ఎమ్మెల్యే వరకు అంతా తమసొంత పనుల్లో బిజీగా ఉన్నారే తప్ప రైతులు, ప్రజాసమస్యలను పట్టించుకోవడం లేద నే వాదన బలంగా వినిపిస్తోంది. తోటపల్లి కుడి ప్రధాన కాలువ ద్వారా వచ్చే నీటితో కనీసం ఒక్క చెరువు కూడా నింపలేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

28 వేల ఎకరాల ఆయకట్టు..224 చెరువులు

చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో చీపురుపల్లి, గరివిడి, గుర్ల, నెలిమర్ల, పూసపాటిరేగ మండలాలు ఉన్నాయి. అయిదు మండలాల్లో పూస పాటిరేగ మండలంలో కాలువ పనులు జరగాల్సి ఉంది. మిగిలిన మండలాల్లో 28 వేల ఎకరాల ఆయక ట్టుకు తోటపల్లి కాలువ ద్వారా సాగు నీరు అందించేవారు. ఇందుకోసం 224 చెరువులను నీటితో నింపేవారు. గతంలో జూలై నెలాఖరు నాటికే సగానికి పైగా చెరువులు నింపేసే వారు. ఈ ఏడాది మాత్రం ఆగస్టు నెల పూర్తయినా ఒక్క చెరువు కూడా నింప లేదు. 28 వేల ఎకరాల ఆయకట్టులో ఒక్క ఎక రానికి నీరు అందలేదు.

వర్షాలే దిక్కు.....

దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ఎంతో గొప్ప ఆశయంతో తోటపల్లి కుడి ప్రధాన కాలువ పనులు జరిపించారు. ప్రస్తుతం ఈ కాలువ ద్వారా నీరు రాకపోవడంతో ప్రయోజనం లేకుండా పోయింది. వర్షాల కోసం రైతులు ఎదురు చూడాల్సిన దుస్థితి నెల కొంది. ఇంతవరకు చెరువుల్లో ఉన్న నీరంతా ఇటీవల కురిసిన వర్షాల పుణ్యమే. తోటపల్లి కుడి ప్రధాన కాలువలో కనిపిస్తున్న నీరు కూడా వర్షాలకు చేరిన నీరే కావడం గమనార్హం.



చీపురుపల్లి మండలంలోని రావివలస సమీపంలో తోటపల్లి కాలువ

చివరిలో ఉండడంతో కష్టమవుతోంది

తోటపల్లి రిజర్వాయర్ నుంచి చీపురుపల్లి సబ్ డివిజన్ పరిధిలో కాలువలు చివరిలో ఉండడంతో నీరు రావడానికి కష్టంగా మారింది. ఆగస్టు 11న తోటపల్లి కాలువ ద్వారా నీరు విడుదల చేశాం. కొంతవరకు నీరు ఇచ్చాం. తాజాగా శ్రీకాకుళం బ్రాంచ్ కెనాల్ వద్ద నిలిపినట్లు ఉంది. మళ్లీ త్వరలో నీరు విడుదల చేస్తాం.

– సుచిత్ర, తోటపల్లి కాలువ డీఈ, చీపురుపల్లి సబ్ డివిజన్

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామి వారు

జామి: భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ వద్ద వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు వరప్రసాద్ ఆచార్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా స్వామి వారికి అభిషేకాలు చేసి, వివిధ పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

వృద్ధాశ్రమానికి ఆర్థిక సహాయం



ఆశ్రమ నిర్వాహకుడు లక్ష్మణరావుకు నగదు అందజేస్తున్న దాత నర్సింగరావు

చీపురుపల్లి: స్థానిక బాపూజీ వృద్ధాశ్రమానికి దాతలు శనివారం ఆర్థిక సహాయం చేశారు. పట్టణానికి చెందిన పొట్నూరు నర్సింగరావు కుమార్తె ప్రవీణ, అల్లుడు జయచంద్రకుమార్‌ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా రూ.10 వేలు, గరివిడి మండలంలోని దుమ్మెద గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు రెడ్డి సత్యనారాయణ భార్య సుగుణ వర్థంతి నేపథ్యంలో రూ.5 వేలు అందజేశారు.

ఇంటి పట్టా మంజూరు



మహిళకు ఇంటి పట్టా అందజేస్తున్న తహసీల్దార్ ఆదిలక్ష్మి

గుర్ల: మండల కేంద్రంలో శనివారం పింఛన్ పంపిణీ పరిశీలించడానికి వచ్చిన కలెక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్‌ను స్థానికురాలు కొండపల్లి సుమతి తనకు ఇంటి పట్టా మంజూరు చేయాలని వినతిపత్రం అందజేసింది. కలెక్టర్ స్పందిస్తూ అర్హత ఉంటే వెంటనే ఆ మహిళకు ఇంటి పట్టా అందించాలని తహసీల్దార్ ఆదిలక్ష్మిని ఆదేశించారు. సుమతి వివరాలను తహసీల్దార్ సేకరించి, పరిశీలించిన అనంతరం రెవెన్యూ కార్యాలయంలో ఇంటి పట్టా మంజూరు చేశారు.

జిల్లా డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడిగా రామారావు



రామారావును అభినందిస్తున్న డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు

చీపురుపల్లి: రేషన్ డిపో డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన రుంకాన రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.మాధవరావు నేతృత్వంలో జిల్లా కేంద్రంలోని పింఛనర్ల సంఘ భవనంలో జిల్లా సంఘం ఎన్నికలు శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పట్టణంలోని రుంకానవీధికి చెందిన డీలర్ రామారావు జిల్లా ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రామారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండలంలోని డీలర్లు శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసర సరుకుల పంపిణీ



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న దాతలు

కొత్తవలస: తుమ్మికాపల్లిలోని ఫర్ ది పీపుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 42 మంది ఒంటరి వృద్ధులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. అప్పన్నపాలెం పంచాయతీ శివారు దత్తి గ్రామానికి చెందిన పెదిరెడ్ల జగన్ పాత్రుడు జ్ఞాపకార్థం ఆయన తల్లిదండ్రులు ఉమామేశ్వరరావు, రూపమ్మ ఆర్థిక సహాయంతో వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశామని ట్రస్టు చైర్మన్ వి.హరికుమార్ తెలిపారు. ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతీ నెల వృద్ధులకు సరుకులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

గొర్రిపాటి పేరును పునరుద్ధరించండి



ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న వెలమసంఘం నాయకులు

శృంగవరపుకోట: గంట్యాడ మండలంలోని తాటిపూడి జలాశయానికి గత ప్రభుత్వం పెట్టిన గొర్రిపాటి బుచ్చిఅప్పారావు పేరును కొనసాగించాలని, ఈమేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని పుణ్యగిరి వెలమ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. వెలమ సంఘం అధ్యక్షుడు కె.కోటేశ్వరరావు నేతృత్వంలో సంఘం నాయకులు స్థానిక ఎమ్మెల్యే లలితకుమారిని ఆమె నివాసంలో శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. తాటిపూడి రిజర్వాయర్ ఏర్పాటు కోసం విశేష కృషి చేసిన స్థానిక నాయకుడు స్వర్గీయ గొర్రిపాటి బుచ్చిఅప్పారావు గుర్తుగా గత ప్రభుత్వం రిజర్వాయర్‌కు ఆయన పేరు పెడుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఈప్రాంత వాసులంతా స్వాగతించారన్నారు. ఆయన సేవలను దృష్టిలో ఉంచుకుని, తాటిపూడి రిజర్వాయర్ పేరు మార్పు నిర్ణయాన్ని ప్రభుత్వం పునః సమీక్షించాలని, రిజర్వాయర్‌కు ఆయన పేరును కొనసాగించేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానంటూ హామీ ఇచ్చారు. వెలమ సంఘం ప్రతినిధులు హాజరయ్యారు.,

పింఛన్ల పంపిణీ



చీపురుపల్లి: చీపురుపల్లి పట్టణంలో పింఛన్ లబ్ధిదారుతో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్



గుర్ల: కోటగండ్రేడులో పింఛన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు



బొండపల్లి: జియ్యన్నవలసలో వృద్ధుడికి పింఛన్ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

చీపురుపల్లి: సెప్టెంబర్ నెలకు సంబంధించి సామాజిక పింఛన్లను సచివాలయ సిబ్బంది శనివారం పంపిణీ చేశారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని కస్పావీధిలో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని కార్యక్రమాన్ని కలెక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ తనిఖీ చేశారు. ఆయన వెంట జెడ్పీ ఇన్‌చార్జి సీఈఓ శ్రీధర్‌రాజా, ఎంపీడీఓ కె.రామకృష్ణరాజు తదితరులు ఉన్నారు.

- **గుర్ల:** మండలంలోని కోటగండ్రేడు, గరికివలస గ్రామాల్లో సామాజిక పింఛన్ల నగదును ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు శనివారం పంపిణీ చేశారు. ఎంపీడీఓ కల్యాణి, టీడీపీ నేతలు వెన్నె సన్యాసి నాయుడు, చనమల మహేశ్వరరావు పాల్గొన్నారు.
- **బొండపల్లి:** మండలంలోని జియ్యన్నవలస గ్రామంలో లబ్ధిదారులకు రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ గంట్యాడ శ్రీదేవి, మాజీ జెడ్పీటీసీ బండారు బాలాజీ, జనసేన నాయకులు మిడతాన రవికుమార్, కోరాడ కృష్ణ, మార్రాపు సురేష్‌తో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

కొత్తవలస: వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తప్పవని సీఐ షణ్ముఖరావు హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలో రౌడీ షీట్ నమోదైన 12 మందికి శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవాల్లో చందాల పేరిట దౌర్జన్యాలు చేయడం, సంబరాలు మాటున అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడడం వంటి చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరించాల్సి వస్తుందన్నారు. అనుమానిత వ్యక్తుల కదలికపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. అంతా సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.

3న జాబ్‌మేళా

చీపురుపల్లి: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఈ నెల 3న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి. కృష్ణాజీ శనివారం ఓ ప్రకటన లో తెలిపారు. పదోతరగతి, ఇంటర్, డిప్లమా, ఐటీఐ కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 35 ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులని పేర్కొన్నారు. నాలుగు బహుళ జాతి పరిశ్రమల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. ఆసక్త గల వారు స్కిల్ యూనివర్స్ డాట్ ఏపీఎస్‌ఎస్‌డీసీడాట్ఇన్ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈనెల 3న ఉదయం 9 గంటలకు రెజ్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువీకరణ ఒరిజినల్ పత్రాలు, జెరాక్స్‌లతో పాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని హాజరవ్వాలని తెలిపారు.

కానిస్టేబుల్‌కు సన్మానం



కానిస్టేబుల్ బ్రహ్మేష్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ లోకేశ్వరరావు, సిబ్బంది

మెరకముడిదాం: మండలంలోని బుదరాయవలస పోలీస్ స్టేషన్ నుంచి విజయనగరం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయిన కానిస్టేబుల్ బ్రహ్మేష్‌ను ఎస్‌ఐ బి.లోకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది శనివారం సన్మానించారు. కానిస్టేబుల్ బ్రహ్మేష్ సేవలను సిబ్బంది కొనియాడారు.

వర్గీకరణతో మేలు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్ర మాదిగ, తదితరులు

మెరకముడిదాం: ఎస్సీ వర్గీకరణతో దళితులకు అన్ని విధాలా మేలు జరుగుతుందని, దళితుల అభివృద్ధికి తోడ్పడుతుంద ని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కిల్లాడ సురేంద్ర మాదిగ తెలిపారు. ఉత్తరావల్లి గ్రామంలో శనివారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ వర్గీకరణపై ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణ జర గాలని చాలా మంది దళితులు కోరుకున్నారని, ఇన్నాళ్లకు వారి కోరిక తీరిందన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు యూనిఫాం దుస్తులు అందజేస్తున్న స్నేహ సంస్థ సభ్యులు

శృంగవరపుకోట: పట్టణంలోని పారిశుద్ధ్య కార్మికులకు స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం యూనిఫాం దుస్తులు పంపిణీ చేశారు. అమెరికాలో ఉంటున్న చావా అక్షజ్, అహనా, మంథా సంధ్యల ఆర్థిక సహాయంతో కొనుగోలు చేసిన దుస్తులు, స్వీట్లను స్నేహ సంస్థ అధ్యక్షుడు ఏ.ఎస్.వెంకటరావు, కార్యదర్శి మంథా సుబ్బారావు నేతృత్వంలో 71 మంది కార్మికులకు అందజే శారు. స్నేహ సంస్థ సభ్యులు పి.శ్రీరాములు, వి.శ్రీరామ్మూర్తి, ప్రసాద్, ఎం.ప్రకాశ్, హరీష్, కె.గణేష్, కె.శ్రీను, ఎం.శ్రీను, పండు తదితరులు పాల్గొ న్నారు.

చట్టాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై ఎస్.కోట రూరల్ సీఐ రవికుమార్ శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు వచ్చే సమయంలో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే తక్షణమే తల్లిదండ్రులకు, ఉపాధ్యా యులకు సమాచారం ఇవ్వాలని బాలికలకు సూచించారు. విద్యార్థులంతా సోదర భావంతో మెలగాలన్నారు. లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు క్రమశిక్షణతో చదువుకోవాలని చెప్పారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



దత్తిరాజేరు: ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ జయంతి



బొండపల్లి: వాహన తనిఖీలు చేస్తున్న ఎస్‌ఐ మహేష్, పోలీస్ సిబ్బంది

దత్తిరాజేరు: మైనర్లకు వాహనాలు ఇస్తే సంబంధిత వాహన యజమానులపై చర్యలు తప్పవని పెద మానాపురం ఎస్‌ఐ జయంతి హెచ్చరించారు. మండలంలోని పోరలి కూడలి వద్ద స్థానికు లు, ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ మోసాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువ మరణాలు ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించకపోవ డం వల్లే సంభవిస్తున్నాయని చెప్పారు. అందుకే ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అలాగే వాహనచోదకులు తప్పనిసరిగా వాహన సంబంధిత పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండాలని అన్నారు. సైబర్ నేరాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే గ్రామాల్లోకి కొత్త వ్యక్తులు వచ్చి అనాథ సంస్థల పేరుతో విరాళాలు అడిగితే వెంటనే పోలీస్‌లకు సమాచారం అందించాలని చెప్పారు.

వాహన పత్రాలు తప్పనిసరి

బొండపల్లి: వాహన చోదకులు అంతా తప్పనిసరిగా వాహన సంబంధిత పత్రాలు, లైసెన్స్ కలిగి ఉండాలని, లేకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని బొండపల్లి ఎస్‌ఐ యు.మహేష్ అన్నారు. మండల కేంద్రంలో పోలీస్ సిబ్బందితో కలిసి శనివారం వాహన తనిఖీలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధన లు పాటించాలని చెప్పారు.

అమ్మకోసం ఒక మొక్క నాటుదాం



శృంగవరపుకోట: వెంకటరమణపేట గ్రామంలో మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు



శృంగవరపుకోట: ఎస్.కోట అంగన్‌వాడీ కేంద్రం-1 ఆవరణలో మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు



మెరకముడిదాం: గర్భాం అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న సూపర్‌వైజర్ శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు

శృంగవరపుకోట: మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు అంగన్ వాడీ కేంద్రాల్లో అమ్మ కోసం ఒక మొక్క నాటు దాం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఎస్.కోటలోని శ్రీని వాసకాలనీలో అంగన్‌వాడీ కేంద్రం-1లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దేవి నేతృ త్వంలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటాలని, తల్లిని ఎంత ప్రేమగా చూసుకుంటామో అంతే ప్రేమగా వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్త వి.మాణిక్యం, హెల్పర్ వి.కుమారి తదితరులు పాల్గొన్నారు. వెంకటరమణపేట గ్రామంలో తిమిడి సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు అంతా కలిసి అమ్మకోసం ఒక మొక్క నాటుదాం కార్యక్రమాన్ని సూపర్‌వైజర్ సుశీల నేతృత్వంలో నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాల్లో గర్భిణులు, బాలింతల తో మొక్కలు నాటించారు. అనంతరం ఉమెన్ డవలప్‌మెంట్‌పై ప్రభుత్వం విడుదల చేసిన వెబ్‌సిరీస్‌ను ప్రదర్శించారు.

ఎల్.కోట మండలంలో ...

లక్కవరపుకోట: మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాల్లో అమ్మ కోసం ఒక మొక్క నాటుదాం కార్యక్రమం శనివారం నిర్వహిం చారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు-2,3,5లలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ పి.భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆయా కేంద్రాల కార్యక ర్తలు,ఆయాలు, బాలింతలతో కలిసి మొక్కలు నాటారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వరలక్ష్మి, రామలక్ష్మి,పి.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో..

వేపాడ: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో అంగన్ వాడీ కార్యకర్త, గర్భిణులు, బాలింతలు శనివారం మొక్కలు నాటారు.

భావితరాల కోసం మొక్కలు నాటుదాం

మెరకముడిదాం: భావితరాల కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తాడ్డి శ్రీదేవి, లక్ష్మి, నాగమణి సూచించారు.మండలంలోని గర్భాం, మెరకముడిదాం,గరుగుబిల్లి సెక్టార్ల పరిధి అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో, ఆయా గ్రామాల్లో అంగన్ వాడీ కార్యకర్తలతో కలిసి శనివారం మొక్కలు నాటారు.



లక్కవరపుకోట: ఎల్.కోట అంగన్‌వాడీ కేంద్రం-5లో మొక్కలు నాటుతున్న సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి



వేపాడ: వేపాడ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మొక్కలు నాటుతున్న అంగన్‌వాడీ కార్యకర్త, స్థానికులు

2న రక్తదాన శిబిరం

చీపురుపల్లి: పట్టణంలోని ఎస్.వి.ఆర్ డిగ్రీ కళాశాలలో ఈనెల 2న రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ బి.వి.గోవింద రాజులు తెలిపారు. రక్తదాన శిబిరంపై శనివారం ఆ కళాశాలలో విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఆరోగ్యంగా ఉన్న విద్యార్థులంతా రక్తదానం చేయాలని కోరారు.

పాఠశాల సందర్శన

జామి: మండలంలోని అన్నంరాజుపేట పంచాయతీ సీతానగరం ప్రాథమికోన్నత పాఠశాలను ఎంఈఓ-2 బి.గంగరాజు శనివారం సందర్శించారు. విద్యార్థుల వర్క్ బుక్స్ పరిశీలించి, విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు.అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన వంటకాలను పరిశీలించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.